నేడు జిల్లాస్థాయి 'స్పందన' రద్దు

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర తుపానుగా బలపడిన నేపథ్యంలో సోమవారం జరగాల్సిన జిల్లాస్థాయి స్పందన కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు అధికారుల హెచ్చరికలను పాటిస్తూ ఇంటి వద్దే ఉండాలని, జిల్లా కేంద్రంలో 'స్పందన'కు ఎవరూ రావొద్దని కలెక్టర్ కోరారు. ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

ముంచుకొస్తున్న మిచౌంగ్..

'మిచౌంగ్' తుపాను ముప్పు ముంచుకొస్తోంది.. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మరింత బలపడిన నేపథ్యంలో రైతులకు కంటిమీద కునుకు ఉండడం లేదు. భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ చెప్పడంతో రైతుల గుండెల్లో రైళ్లు పెరిగెడుతున్నాయి. దీంతో రైతులు మాసూళ్ల పనులను ముమ్మరం చేస్తున్నారు.

ఆచంటలో రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం

ప్రజాశక్తి - ఆచంట

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మరింత బలపడనున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. రెండు రోజుల నుంచి వాతావరణం రైతులను ఉరుకుల పరుగులు పెట్టిస్తూ కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఒకపక్క ఎండ మరోపక్క ఈదురుగాలులు, మరో పక్క మబ్బులతో ప్రకృతి విరుచుకుపడుతోంది. దీంతో రైతుల్లో అలజడి నెలకొంది. పంటను కాపాడుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ మండలంలో ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, కందరవల్లి, కరుగోరుమిల్లి, భీమలాపురం, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం శేషమ్మ చెరువు తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. మరో రెండు రోజులపాటు ఈదురుగాలితో కూడిన వర్షం పడుతుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో రైతుల దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర, పోడూరు గ్రామాల్లో సార్వా మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే 30 శాతంపైనే కోతలు పూర్తయ్యాయి. ఈ ఏడాది పంట కూడా బాగానే పండింది. అయితే వాతావరణం అనుకూలించకపోవడం, కూలీల కొరత నేపథ్యంలో వరి కోత యంత్రాల ద్వారా ముమ్మరంగా మాసూళ్లు చేస్తున్నారు.

పాలకొల్లు రూరల్ : మండలంలో మిచౌంగ్ తుపాను ప్రభావంతో ఈదురు గాలులు వీస్తున్నాయి. మండలంలోని వెలివెల, లంకలకోడేరు, దిగమర్రు, సగంచెరువు తదితర ప్రాంతాల్లో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. చాలాచోట్ల వరిచేలు నేలకొరిగాయి. రైతులు హడావుడీగా యంత్రాలతో పంటను కోయించి రక్షించుకునే పనిలో నిమగ్నమయ్యారు. వర్షం పడితే ధాన్యం తడిసిపోయి, మొలకెత్తే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.

పాలకొల్లు : పట్టణంలో తుపాన్ ప్రభావంతో ఈదురుగాలులు భారీగా వీయడంతో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. రైల్వే గేటు ఇవతల హౌసింగ్ బోర్డు కాలనీ పూలపల్లితో పాటు పలు ప్రాంతాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ 6 గంటలకు పైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ పునరుద్ధరణకు సమయం పట్టినట్లు విద్యుత్ శాఖ ఎఇ బాబ్జి చెప్పారు.

ఆకివీడు : వాతావరణ మార్పులు రైతులు, ఆక్వా రైతులను కలవరపెడుతోంది. ఆదివారం ఉదయం నుంచి ఈదురుగాలులు వీయడంతో విద్యుత్ వైర్లు సైతం అక్కడక్కడా జారిపోవడంతో కొంతమేర విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. సాయంత్రం స్వల్పంగా చినుకులు పడ్డాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అధికారులు రైతులకు అండగా నిలవాలి

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

తుపాను హెచ్చరికల దృష్ట్యా అధికారులు రైతులకు అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఆదివారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మండలంలోని శివదేవునిచిక్కాల, బల్లిపాడు, దగ్గులూరు, తిల్లంపూడి, వెలివెల, లంకలకోడేరు ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. రోడ్డు పక్కన, కళ్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించి వెంటనే ఆర్‌బికెలకు తరలించి కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం తరలింపులో అలసత్వం వహించే అధికారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తుపాను బలపడిన కారణంగా జిల్లాలో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఇప్పటికే కోసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలని ఆదేశించారు. రైతులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని తెలిపారు. వర్షాలు ప్రారంభమయ్యేలోపుగా ధాన్యాన్ని ఆర్‌బికెలకు తరలించడం గాని, జాగ్రత్తపర్చుకోవడంగాని చేయాలన్నారు. జిల్లాలోని నరసాపురం, మొగల్తూరు, ఆచంట, యలమంచిలి మండలాలపై తుపాన్ ప్రభావం ఉంటుందని తెలిపారు. అధికారులు గుర్తించిన లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలిరావాలన్నారు. సముద్రంలో అలల తాకిడి ఎక్కువగా ఉన్నందున తీర ప్రాంతానికి ఎవరు వెళ్లకుండా అధికారులు, పోలీసులు కట్టడి చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా, గ్రామ, వార్డు సచివాలయాల అధికా రులు, పాలకొల్లు తహశీల్దార్ సిహెచ్ పెద్దిరాజు, ఎంపిడిఒ కె.వెంకటేశ్వరరావు, వ్యవసాయాధికారి శామ్యూల్ జాన్సన్ పాల్గొన్నారు.

ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కంట్రోల్ రూమ్ పరిశీలన

భీమవరం : తుపాను సమయంలో కంట్రోల్ రూమ్ విధులు ఎంతో కీలకమైనవని, అత్యవసర సమాచారాన్ని సంబంధిత అధికారులకు వెంటనే చేరవేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో 'మిచౌంగ్' తుపాను కంట్రోల్ రూమ్‌ను జిల్లా కలెక్టర్ ఆదివారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. సోమవారం నుంచి తుపాను తీరం దాటే వరకూ వర్షాలు, పెద్ద ఎత్తున గాలులు వీచే ప్రమాదం ఉందన్నారు. ఇటువంటి సమయంలో సహాయం అవసరమైన ప్రజలు కంట్రోల్ రూమ్‌కు ఫోన్‌చేసి సహాయాన్ని కోరడం జరుగుతుందని, వారి వివరాలను, సమస్యను శ్రద్ధగా విని రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లా అధికారుల ఫోన్ నంబర్లన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. కలెక్టర్ వెంట ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, జిల్లా కలెక్టరేట్ పరిపాలనాధికారి వైకెవి.అప్పారావు, కంట్రోల్ రూమ్ సిబ్బంది ఉన్నారు.

నరసాపురం టౌన్ : తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్ అన్నారు. తుపాను హెచ్చరికలతో ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆర్‌డిఒ కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, ఆరోగ్య మత్స్య, వ్యవసాయ, విద్యుత్, ఇరిగేషన్, డ్రెయినేజీ, గ్రామీణ నీటిపారుదల, మున్సిపల్ శాఖాధికారులతో ఆదివారం ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్ తన ఛాంబర్‌లో డివిజన్ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. తుపాను ప్రభావం తగ్గేంత వరకూ మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పేరుపాలెంబీచ్‌కు సందర్శకులు వెళ్లకుండా పోలీస్ శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిడివి.విజయలక్ష్మి, డిప్యూటీ డిఎంహెచ్ఒ వాకపల్లి ప్రసాద్, తహశీలార్లు ఎస్‌ఎం పాజిల్, జి.అనిత కుమారి పాల్గొన్నారు.

ఆచంట (పెనుమంట్ర): తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో సమీప రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నరసాపురం ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్ రైస్ మిల్లర్లకు సూచించారు. ఆదివారం వెలగలేరు, ఆలమూరు గ్రామాల్లో రైతులతో మాట్లాడారు. ఆలమూరులో విష్ణు శ్రీ ఆగ్రోస్ ప్రయివేటు లిమిటెడ్ రైస్ మిల్లును పరిశీలించి యాజమాన్యంతో మాట్లాడారు. ఈ సందర్భంగా అంబరీష్ మాట్లాడుతూ రైతుల నుంచి 15 నుంచి 23 తేమ శాతం ఉన్న ధాన్యాన్ని కూడా రైతు భరోసా కేంద్రం ద్వారా దగ్గరలో ఉన్న మిల్లులకు రవాణా చేయాలని ఎఇ జ్యోషిలకు సూచించారు. రైతుల వద్ద ధాన్యం నిల్వ లేకుండా, తుపాన్ వల్ల నష్టం జరగకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దండు అశోక్ వర్మ, ఎంపిడిఒ పి.పద్మజ, ఎఇఒ సత్యనారాయణ, విఎఎలు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలకోడేరు: రైతులు మాసూళ్లు పూర్తి చేసిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా నచ్చిన రైసు మిల్లులకు తరలించుకోవచ్చని జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి తెలిపారు. తుపాన్ ప్రభావం నేపథ్యంలో రైతులు వరి కోతలను నాలుగు రోజులు వాయిదా వేసుకోవాలని సూచించారు. ఆదివారం కోరుకొల్లు గ్రామంలో ఆరబోసిన ధాన్యాన్ని జెసి పరిశీలించి రైతులతో మాట్లాడారు. తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు తమ సొంత వాహనాలను జిపిఎస్ లేకపోయినా ఉపయోగించు కోవచ్చని, ఆఫ్‌లైన్ ద్వారా కూడా ధాన్యం అమ్మకాలు జరుపుకోవచ్చని తెలిపారు. ఆయన వెంట తహశీల్దారు షేక్ హుస్సేన్, వ్యవసాయ అధికారి నారాయణరావు, రైతు భరోసా కేంద్రం, వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మొగల్తూరు : పశువులను తుపాన్ వెళ్లే వరకూ బయటకు వదలొద్దని పశుసంవర్థక శాఖ జెడి మురళీకృష్ణ రైతులకు సూచించారు. పేరుపాలెంలో ఆదివారం పశువులకు దొమ్మ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. తుపాన్ ప్రభావంతో పిడుగులు పడే అవకాశం ఉందన్నారు. పశువులు వ్యాధి బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తప్పకుండా దొమ్మ వ్యాధి నివారణ టీకాలు వేయించాలన్నారు. ఆయన వెంట ఎడి.సుధాకర్, పశు వైద్యులు జి.నీలిమ, ఐ.సురేంద్ర ఉన్నారు.

బిజెపి విధానాలతో ప్రజలకు కష్టాలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీతారాం

ప్రజాశక్తి - భీమవరం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో సర్వం నాశనమైందని, ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం విమర్శించారు. సిపిఎం జిల్లా విస్తృత సమావేశం స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాలులో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముఖ్యవక్త సీతారాం మాట్లాడుతూ దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు 45 శాతం పెరిగాయన్నారు. దానిలో పప్పులు 56 శాతం, బియ్యం 43 శాతం పెరిగాయన్నారు. గ్రామీణ నిరుద్యోగం విపరీతంగా పెరిగిందన్నారు. ఉపాధి పనులకు డిమాండ్ పెరిగిందని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీకి బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో భారీ కోత విధించిందని చెప్పారు. తద్వారా ఉపాధి హామీని నిర్వీర్యం చేసి కూలీల పొట్ట కొడుతోందన్నారు. గ్రాడ్యుయేట్ నిరుద్యోగం 42 శాతం పెరిగిందన్నారు. చదువుకున్న వారికి ఉద్యోగం లేక నిరుద్యోగులై తిరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాల కల్పనలో విఫలమయ్యాయని విమర్శించారు. బిజెపి అధికారంలోకొచ్చాక పెట్రోల్ 35 శాతం, డీజిల్ 60 శాతం, గ్యాస్ ధర మూడు రెట్లు పెరిగిందన్నారు. కార్పొరేట్లకు పన్నుల రాయితీలు, ప్రోత్సాహకాలు ఇచ్చి దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతోందన్నారు. ధనిక, పేదల మధ్య అంతరం పెరిగిందన్నారు. అదాని షేర్ల కుంభకోణం చేస్తే దానిపై మోడీ నోరు మెదపలేదన్నారు. దీనిపై ఎటువంటి చర్యలూ లేవన్నారు. వీటన్నింటిపైనా మాట్లాడే ప్రతిపక్షాలు, ప్రజాస్వామ్యవాదులు, పత్రికలపైనా మోడీ ప్రభుత్వం దాడులకు దిగుతోందని విమర్శించారు. ఇటీవల సిపిఎం అధిక ధరలు, నిరుద్యోగం తదితర సమస్యలపై పెద్దఎత్తున ప్రజారక్షణ భేరి పేరిట ఆందోళనలు, యాత్రలు చేపట్టి విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహించిన విషయం గుర్తు చేశారు. వీటికి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. ప్రజలను ప్రాంతాలు, కులాల వారీగా విడగొట్టి నీచ రాజకీయాలు చేస్తున్న వారిని గద్దె దించాలని పిలుపునిచ్చారు.

అన్ని పంటలకూ మద్దతు ధర ప్రకటించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

అన్ని పంటలకూ మద్దతు ధర ప్రకటించి అన్ని రకాల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. ధాన్యం సొమ్ము త్వరగా అందేలా చూడాలన్నారు. రబీకి సాగునీటి ఎద్దడి ఉంటుందనే వార్తలు రైతులను ఆందోళనకు గురి చేస్తుందన్నారు. ప్రతి ఎకరాకూ నీరందేలా సాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. ఆక్వా రైతుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. వారు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న ఇళ్ల కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేవన్నారు. తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ, అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూళ్లు, కమ్యూనిటీ హాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఇంకా లబ్ధిదారులకు ఇవ్వని ఇళ్లను తక్షణం ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి ఇచ్చే రూ.లక్షా 80 వేలు బేస్‌మెంట్‌కే సరిపోవడం లేదన్నారు. ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, జెఎన్‌వి.గోపాలన్, డి.కళ్యాణి, కేతా గోపాలన్, కౌరు పెద్దిరాజు, కె.నాగేశ్వరరావు, పివి.ప్రతాప్, ఆయా మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలి

వృత్తి చెరువులపై రజకులకే పూర్తి హక్కు కల్పించాలి

రజక గర్జన సభలో ఎపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య

రజక గర్జన సభలో మాట్లాడుతున్న మన్నూరు భాస్కరయ్య

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్రవ్యాప్తంగా రజకులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, అక్రమకేసులు, రజక మహిళలు, బాలికలపై అత్యాచారాలు, హత్యలు, అపార్టుమెంట్ వాచ్‌మెన్ కమ్ ఇస్త్రీదారులపై అక్రమ కేసులు, వేధింపుల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం రజకులకు సామాజిక రక్షణ చట్టం వెంటనే ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌కె గ్రౌండ్‌లో రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మడక రాజు అధ్యక్షతన జరిగిన రజక గర్జన సభలో భాస్కరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాస్కరయ్య మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు పూర్తవుతున్నా నేటికీ రజకులపై దాడులు కొనసాగడం దుర్మార్గమన్నారు. దీనికి ఇప్పటి వరకు పరిపాలించిన పాలకుల నిర్లక్ష్యమే కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులకు రజకుల అభివృద్ధి, సంక్షేమం ఏమాత్రం పట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రజక అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించకపోవడం, విధివిధానాలు రూపొందించకపోవడం, రజకుల పట్ల ప్రభుత్వ ఉదాశీన వైఖరి తెలియజేస్తుందన్నారు. బిసి కార్పొరేషన్ నిధులను ప్రభుత్వమే ఇతర అవసరాలకు మళ్లించి రజకులను అభివృద్ధి చెందకుండా మోసపూరిత పాలన సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన నాలుగు సంవత్సరాల కాలంలో రజక అభివృద్ధి సంక్షేమం కార్పొరేషన్ ద్వారా రాష్ట్రంలోని ఏఒక్క రజకునికీ ఒక్క రూపాయి కూడా రుణ సహాయం అందించకుండా కాలయాపన చేశారని, రజక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్, డైరెక్టర్లు కేవలం ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారన్నారు. రజక అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్ సమావేశాల్లో చేసిన తీర్మానాల్లో ఏ ఒక్కటీ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించకుండా పెడచెవిన పెట్టడం దారుణమనానరు. తద్వారా రజకులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. గడచిన నాలుగేళ్లలో వివిధ కులాల ప్రజలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వం రజకులకు ఆత్మీయ సమావేశం నిర్వహించడానికి ఒక్కరోజు కూడా కేటాయించకపోవడం రజకుల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఎలాంటిదో రుజువు చేస్తుందన్నారు. లాండ్రీ వృత్తిదారులకు నెలకు 150 యూనిట్లు ఉచితంగా ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినా కార్యాచరణకు నోచుకోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బిసిలను ఉద్ధరిస్తున్నట్టు సామాజిక, సంక్షేమ యాత్రల పేరుతో ఓటుబ్యాంక్ రాజకీయాలకు తెరతీస్తూ, బిసి సామాజిక తరగతులను మోసగిస్తోందన్నారు. ప్రభుత్వ విధానాలపై సంఘటిత పోరాటాలకు రజకులు సమాయత్తం కావాలన్నారు. ఎపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గురుశేఖర్ మాట్లాడుతూ రజక వృత్తి సామాజిక సేవ వృత్తిగా పని చేస్తున్నారన్నారు. రజకులకు కూడా 50 ఏళ్లకే వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. ఆహ్వాన సంఘ అధ్యక్షులు నూకరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ఉన్న రజక వత్తిదారులందరూ తాడేపల్లిగూడెంలో చైతన్య తరగతులను జయప్రదం చేయాలన్నారు. పశువులేటి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రజక వృత్తి సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు. ఈ సభలో సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యులు కోనేటి రాజు, ఈశ్వరరావు, లింగాల నిర్మలమ్మ, అంకయ్య, బొజ్జ సుబ్బారావు, దిలీప్, పాగోలు శ్రీనివాస్, మండూరు వెంకట నరసయ్య, వద్దిపర్తి శ్రీనివాస్, యండమూరి నాగేంద్ర, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

4 వేల మంది పిల్లలతో బాలోత్సవం

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 30, 31వ తేదీల్లో చింతలపాటి బాపిరాజు ఉన్నత పాఠశాలలో 4 వేల మంది పిల్లలతో బాలోత్సవం పోటీలకు ఏర్పాటు చేసినట్లు వసుధ ఫౌండేషన్ కార్యదర్శి మంతెన కృష్ణంరాజు, భీమవరం బాలోత్సవం కమిటీ అధ్యక్షులు ఇందుకూరి ప్రసాదరాజు అన్నారు. శ్రీరామపురంలో గాంధీ కస్తూరిభా భవనంలో భీమవరం బాలోత్సవం కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. చింతలపాటి బాపిరాజు ఉన్నత పాఠశాలలో బాలోత్సవ కార్యక్రమం నిర్వహించేందుకు నిర్ణయించారు. నాలుగు వేల మందితో నిర్వహించనున్న పోటీల్లో పది అంశాల్లో విద్యా సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నామన్నారు. భీమవరం పట్టణం, భీమవరం రూరల్, పాలకోడేరు, ఉండి, వీరవాసరం, కాళ్ల మండలాల పరిధిలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ సభ్యులు కెబివి.మురళీకృష్ణ, పి.సీతారామరాజు, షేక్ వలీ, జి.జేమ్స్, పివి.సూర్యనారాయణ, సిహెచ్.పట్టాభిరామయ్య, కె.అశోక్, పి.శ్రీనివాసరాజు, కైఎస్.సిహెచ్ సాయిరామ్, రేపాక వెంకన్నబాబు, చైతన్యప్రసాద్, కె.చంద్రరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వసుధ ఫౌండేషన్ కార్యదర్శి కృష్ణంరాజు

విన్నపాలు వినవలె..!

నాడు 'ప్రజావాణి', ఆపై 'స్పందన'.. నేడు 'జగనన్నకు చెబుదాం'.. ప్రజలు తమ సమస్యలు అధికారులకు చెప్పుకోవడానికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు.. కార్యక్రమాల పేర్లు అయితే మారుతున్నాయనేగాని సమస్యల పరిష్కారం మాత్రం నానాటికీ తీసికట్టుగా మారుతోందని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దానికి నిదర్శనం ప్రతి సోమవారమూ నిర్వహించే జిల్లాస్థాయి స్పందన కార్యక్రమానికి ఇప్పటికీ వందల సంఖ్యలో అర్జీలు రావడం, వాటిలో సుమారు సగం గతంలో వినతులిచ్చినా పరిష్కరించలేదనేవే ఉండటం గమనార్హం.

ప్రజా సమస్యలు అపరిష్కృతంగా పేరుకుపోతున్నాయనడానికి నిదర్శనం ప్రతి సోమవారమూ ఆయా జిల్లాల కలెక్టరేట్లలో నిర్వహించే స్పందన కార్యక్రమానికి వచ్చే వినతుల సంఖ్యే. గత సోమవారం ఏలూరు జిల్లా కేంద్రంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 228 వినతులు రాగా, పశ్చిమగోదావరి జిల్లా కేంద్రంలో నిర్వహించిన స్పందనకు 192 అర్జీలు వచ్చాయి. తాజాగా జగనన్నకు చెబుదాం పేరిట వారంలో బుధ, శుక్రవారాల్లో జిల్లా అధికారులే ఏదోక మండలం ఎంచుకుని మండలస్థాయిలో వినతులు స్వీకరించే కార్యక్రమం తలపెట్టారు. ఈ ఆలోచన, కార్యాచరణ కచ్చితంగా అభినందనీయం. తమ సమస్యల పరిష్కారానికే జిల్లా కేంద్రం వరకూ రావాల్సిన అవసరం లేకుండా జిల్లా అధికారులే మండల కేంద్రానికి వెళ్లడాన్ని అంతా స్వాగతిస్తున్నారు. అయితే వినతుల స్వీకరణ వరకూ అంతా బాగున్నా వాటి పరిష్కారం విషయంలోనే జనంలో తీవ్ర అసంతృప్తి పెరిగిపోతోంది. గ్రామ సచివాలయం, మండలస్థాయిలో పరిష్కరించాల్సిన వినతులు జిల్లాస్థాయికి వచ్చినప్పుడు జిల్లా అధికారులు అంత సీరియస్‌గా తీసుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. జిల్లాస్థాయి స్పందనలో ఇచ్చిన వినతులను సైతం కింది స్థాయి అధికారులకు పంపి చేతులు దులుపుకుంటున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో గ్రామస్థాయి అధికారులు అర్జీదారుని ఇంటికి వెళ్లి 'మీ వినతి అందింది' అంటూ ఒక ఫొటో తీసుకుని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తే ఆ సమస్య పరిష్కారమైపోయిట్లు మండల, జిల్లా అధికారులు ధ్రువీకరించేస్తున్నారు. దీంతో ఆయా అర్జీదారులకు ఏం చేయాలో పాలుపోక, సమస్య పరిష్కారం కాక తలలు పట్టుకుంటున్నారు. జిల్లా అధికారుల తీరుతో మండల, గ్రామస్థాయి అధికారులు సైతం స్పందన సమస్యల పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనేది బహిరంగ రహస్యం. ఇటీవల పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండల కేంద్రంలో నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో తాను ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం అందిస్తున్న సాయం పూర్తిగా అందలేదని ఒక లబ్ధిదారుడు అర్జీ ఇచ్చాడు. ఆయన ఆరు నెలల క్రితం జిల్లా కేంద్రం భీమవరంలో నిర్వహించిన 'స్పందనలో'నూ వినతి ఇచ్చాడు. అయినా పరిష్కారం కాకపోవడంతో మండలస్థాయిలో జిల్లా అధికారులు నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో మరోమారు వినతి ఇచ్చాడు. దీనిపై సచివాలయ స్థాయి అధికారి 'మీరు ఎక్కడ అర్జీ ఇచ్చినా వచ్చేది మా దగ్గరకే..' అంటూ ఎగతాళిగా మాట్లాడటం గమనార్హం. ఆ అర్జీదారునికి సొమ్ము పడకపోగా వైబ్‌సైట్‌లో సమస్య పరిష్కారమైనట్లు చూపడం జిల్లా, మండలస్థాయి అధికారుల పర్యవేక్షణాలోపం, నిర్లక్ష్యానికి ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పుకోవచ్చు.



సమీక్షలు.. హెచ్చరికలతోనే సరి

ప్రతివారమూ 'స్పందన' వినతుల పరిష్కారంపై జిల్లా కలెక్టర్లే నేరుగా సమీక్షిస్తున్నారు. అర్జీల పరిష్కారంలో కచ్చితంగా నాణ్యతతోపాటు అర్జీదారుని సంతృప్తి కూడా ఉండాలని పదేపదే హెచ్చరిస్తున్నారు. అయితే సమీక్షలు, హెచ్చరికలతో సరిపెడుతుండటంతో మండల, గ్రామస్థాయి అధికారుల తీరు మారడం లేదని తెలుస్తోంది. ఏలూరు జిల్లా అధికారులు ఈ విషయంలో కొంత మెరుగు అని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. స్పందనలో వచ్చిన అర్జీలకు సంబంధించి పరిష్కారమైనట్లు కిందిస్థాయి నుంచి నివేదికలు వచ్చాక ఆ అర్జీదారులను కలెక్టరేట్‌కు రప్పించి కలెక్టర్ వారితో నేరుగా మాట్లాడే ప్రయత్నం చేయడం కచ్చితంగా అభినందనీయం. ఈ ప్రక్రియ మండల, గ్రామాధికారుల్లో కొంత అప్రమత్తత పెంచిందనే చెప్పొచ్చు. అయితే పశ్చిమగోదావరి జిల్లాలో మాత్రం ఇటువంటి ప్రక్రియ చేపట్టకపోగా జిల్లా అధికారులే 'స్పందన' వినతులపై ఉదాశీనత ప్రదర్శిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. 'స్పందన' వినతి ఇచ్చాక సైతం పెనుమంట్ర మండలానికి చెందిన లబ్ధిదారుడిని ఇంటి సొమ్ము కోసం 'హౌసింగ్ డిఇని కలవండి, లేదా పీడీని కలవండి' అంటూ గ్రామ, మండల అధికారులు చెప్పడం ఇక 'స్పందన'లో వినతులివ్వడం ఎందుకనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి క్షేత్రస్థాయిలోనూ పరిశీలన ప్రారంభిస్తేనే జనానికి సమస్యల నుంచి ఊరట లభించే అవకాశం ఉంది. లేనిపక్షంలో వినతులపై అటు ప్రభుత్వం, ఇటు అధికారుల స్పందన కరువైందనే అభిప్రాయం ప్రజల్లో బలంగా నాటుకుని ప్రభుత్వ వ్యతిరేకతకు దారితీస్తుందని రాజకీయ పరిశీలకులు సైతం హెచ్చరిస్తున్నారు.

ఇక స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు సైతం సమస్యలు నేరుగా తనకు చెప్పొద్దని, ఆయా స్థానిక సంస్థల అధిపతికే చెప్పాలని ముఖ్యఅధికారి చెప్పడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఏలూరు జిల్లాలో ఒక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఇటీవల జరిగింది. దీనిలో ఒక కౌన్సిలర్ తన వార్డులో సమస్యలు పరిష్కారం కావడం లేదని కమిషనర్‌ను నిలదీశారు. దీనిపై కమిషనర్ చెప్పిన సమాధానం విస్మయం కల్గిస్తోంది. తన పరిధిలో లేని సమస్య అయితే సంబంధిత ఉన్నతాధికారులకో, లేదా ప్రజాప్రతినిధుల దృష్టికో తీసుకెళ్తామని చెప్పడం సర్వసాధారణం. అయితే దానికి భిన్నంగా 'సమస్యలేమైనా కౌన్సిలర్లు ఛైర్‌పర్సన్‌కు చెప్పాలని, ఛైర్‌పర్సన్ చెబితేనే తాము పని చేస్తామనడం' స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు సదరు అధికారి ఇచ్చే గౌరవం ఏపాటిదో స్పష్టమవుతోంది. అంటే 'స్పందన'లో ప్రజలు ఇచ్చే అర్జీలను పరిష్కరించని అధికార గణం, ఆ ప్రజల ప్రతినిధులైన ఆయా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు చట్టబద్ధమైన సమావేశంలో సమస్యలు ప్రస్తావించినా పట్టించుకోరా అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ తీరు కచ్చితంగా ప్రభుత్వ వ్యతిరేకతకు దారితీస్తుందనడంలో ఎటువంటి సందేహమూ లేదని రాజకీయ పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.

- వివిఎస్‌ఎస్‌వి.ప్రసాద్

మృతుల పేర్లు తొలగించాలి

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

ఓటర్ల నమోదు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మృతుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ ఓటర్‌గా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. బల్లిపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక ఓటర్ల నమోదు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పరిశీలించారు. బిఎల్‌ఒల రిజిష్టర్లు, క్లెయిములు, దరఖాస్తులను తనిఖీ చేశారు. ఫారమ్ 6, 7, 8 దరఖాస్తులను, స్లిప్పులు స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మరణించిన వారి పేర్లు జాబితాలో లేకుండా చూడాలన్నారు. మృతుల కుటుంబ సభ్యుల నుంచి డెత్ సర్టిఫికెట్ తీసుకొని గానీ, పంచనామా నిర్వహించి గానీ పేర్లను తొలగించవచ్చని సూచించారు. 18 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలని ఆదేశించారు. డోర్ టు డోర్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఓటర్ల నమోదులో వ్యత్యాసాలను సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, గ్రామ, వార్డు సచివాలయాల అధికారి కెసిహెచ్.అప్పారావు, పాలకొల్లు తహశీల్దార్ సిహెచ్ పెద్దిరాజు, ఎంపిడిఒ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రీ సర్వేను పరిశీలిస్తున్న జెసి రామ్‌సుందర్‌రెడ్డి

కంప్యూటర్ డేటా పనులు సకాలంలో పూర్తి చేయాలి

జెసి రామ్‌సుందర్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

మూడో విడత రీ సర్వే ఫైనల్ రికార్డ్స్, కంప్యూటర్ డేటా పనులు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో ఆదివారం మూడో విడత రీ సర్వే ఫైనల్ రికార్డ్స్‌ను, కంప్యూటర్ డేటాను ఆయన పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. మూడో విడత రీ సర్వే పనులు డిసెంబర్ 31వ తేదీ నాటికి పూర్తి చేయాలని జిల్లా సర్వే అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి కె.జాషువా, ఆకివీడు మండల ల్యాండు సర్వే అధికారి నడింపల్లి ప్రవీణ్‌కుమార్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగు కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ ఖజావల్లి

సమర్ధవంతంగా ఓటరు నమోదు

ప్రజాశక్తి - గణపవరం

కొత్త ఓటర్ల నమోదులో యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఏలూరు ఆర్‌డిఒ ఎస్‌ఎస్.ఖజావలి అన్నారు. మండలంలో జరుగుతున్న ఓటరు నమోదు పోలింగ్ కేంద్రాలను ఆయన ఆదివారం పరిశీలించారు. ఓటరు లిస్టులో మార్పులు, చేర్పులు వంటి విషయంలో అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓటు నమోదు పోలింగ్ కేంద్రం వద్ద స్థానికులతో మాట్లాడారు. ఆయనతో పాటు గణపవరం తహశీల్దార్ పి.లక్ష్మి ఉన్నారు.

ఉండిలో...

పలుచోట్ల 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - ఉండి

చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. మండలంలోని వాంద్రం గ్రామంలో ఆదివారం నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీ, ఇంటింటికి మన రాంబాబు కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ మడమ తిప్పను మాట తప్పనని చెప్పిన జగన్ మోహన్‌రెడ్డి ఆక్వా రైతుల విద్యుత్ రాయితీ విషయంలో మాట తప్పి మడమ తిప్పాడని విమర్శించారు. నాణ్యతలేని సీడ్, పెరిగిన మేత ధరలు, విద్యుత్ ఛార్జీల ధరల వల్ల ఆక్వా రైతులు సాగు వదులుకుని రోజు కూలీలుగా మారారని వాపోయారు. ఇంటింటికి తిరుగుతూ టిడిపి అధికారులకు వస్తే చేకూరే లబ్ధిని వివరించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కరిమేరక నాగరాజు, పార్టీ గ్రామ అధ్యక్షులు కందుల రాధాబలరామకృష్ణ శ్రీనివాస్, నాయకులు కిన్నెర వెంకన్న, జుత్తిగ శ్రీనివాస్, మంతెన సాయిలచ్చిరాజు, మజ్జి కృష్ణప్రసాద్, సందక నాగరాజు, జాకీర్ పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : పట్టణంలోని గునుపూడి, దుర్గాపురంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని యూనిట్ ఇన్‌ఛార్జులు మద్దుల రాము, తుమ్మిడి సుబ్బారావు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన టిడిపి జిల్లా అధ్యక్షురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాల ప్రచారంలో పేద, మధ్యతరగతి మహిళలందరూ స్వచ్ఛందంగా ముందుకు వస్తూ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారన్నారు. రాష్ట్రానికి రాజధాని లేనందున యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని మహిళలు ఆవేదన చెందుతున్నారన్నారు. 39వ వార్డు ఇన్‌ఛార్జి తుమ్మిడి సుబ్బారావు మాట్లాడుతూ లంకపేట దుర్గాపురంలోని ఐదు పోలింగ్ బూత్‌లలోని ప్రజలందరికీ చంద్రబాబు మహానాడులో ప్రకటించిన ఆరు పథకాలను వివరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్ష కార్యదర్శులు తిరుమలశెట్టి శ్రీనివాసరావు, అడవికొలను రాంబాబు, బూత్ ఇన్‌ఛార్జులు కోమలి సూర్యనారాయణ, పాశంశెట్టి రాజు, కొల్లం రమేష్, గంధం రాధా, రేఖ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీరామచంద్రమూర్తి

అందరూ సేవాతత్వం కలిగి ఉండాలి

ప్రజాశక్తి - ఆచంట

వ్యాపారంతో పాటు సేవాతత్వంతో ముందుకు వెళ్లాలని ఆచంట శెట్టిబలిజ వర్తక సంఘం అధ్యక్షులు పెచ్చెట్టి శ్రీరామచంద్రమూర్తి సూచించారు. ఆచంట ఎఎంసి ఆవరణలో శెట్టిబలిజ వర్తక సంఘం వార్షికోత్సవం, కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆచంట ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కేత రామకృష్ణ, శెట్టిబలిజ సాధికార రాష్ట్ర డైరెక్టర్ గుడాల శ్రీనివాసరావు, సంఘ నాయకులు దొంగ నాగార్జున, పెచ్చెట్టి సత్యనారాయణ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు సంఘ పెద్దలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యులు పెచ్చెట్టి రామకృష్ణ, గంజ శ్రీనివాస్, గుబ్బల జగదీష్, కేత రామాంజనేయులు, దొమ్మేటి రాంబాబు, కేత నాగాంజనేయులు, కడలి రామకృష్ణ పాల్గొన్నారు.

477 ఓట్లు సవరణ

ఆకివీడు :మండలంలో మొత్తం 477 ఓట్లలో మార్పులు, చేర్పులు జరిగినట్లు మండల సహాయ ఎన్నికల అధికారి, తహశీల్దార్ నడింపల్లి విజయలక్ష్మి తెలిపారు. రెండు రోజులుగా ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల డ్రైవ్ కార్యక్రమంలో 15 ఏళ్లు నిండిన వెంటనే ఓటర్లుగా జాయిన్ అయ్యేవారు 112 మంది కాగా, గతంలో ఓటర్లుగా కాని వారు 96 మంది చేరాలని చెప్పారు. కాగా 122 మంది ఓట్లు తొలగించినట్లు చెప్పారు. మరొక 147 మంది ఓట్ల పేర్లలోనూ, ఫొటోలు మార్పులు, చేర్పులతో సవరణలు చేసినట్లు చెప్పారు. మొత్తమ్మీద మండలంలో 208 కొత్త ఓట్లు చేరినట్లు అయింది.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

బిసి హాస్టల్లో న్యాయవిజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నరసాపురం బిసి బాలుర వసతి గృహంలో ఆదివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగం, అందులో పొందుపరిచిన అధికరణలు, ప్రాథమిక హక్కులు, విధులు, చట్టాల రూపకల్పన, చట్టాలు ఉల్లంఘిస్తే తీసుకునే చర్యలు, విధించే శిక్షలపై విద్యార్థి దశ నుంచి అవగాహన కలిగి ఉండాలన్నారు. వికలాంగులకు సహాయ సహకారాలు అందించాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే హాస్టల్ వార్డెన్‌కి గాని, కోర్టులో ఉన్న మండల న్యాయ సేవాధికార సంస్థకు తెలిపితే సత్వర చర్యలు తీసుకుంటామని తెలిపారు. సదస్సు అనంతరం హాస్టల్ వంట గదిని, స్టోర్ రూమ్‌ను, హాస్టల్ గదులను, బాత్రూంలను, పిల్లల కోసం వండుతున్న భోజనాన్ని, కూరగాయలను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సదుపాయాల గురించి హాస్టల్ వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షులు, సంస్థ సభ్యులు చల్లా దానయ్యనాయుడు, సీనియర్ న్యాయవాది నారిన శ్రీనివాసరావు, ఉచిత న్యాయవాది నక్కా ఆనందబాబు, టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, వార్డెన్ సత్యనారాయణమూర్తి హాజరై పలు చట్టాలపై పిల్లలకు అవగాహన కల్పించారు.

న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు

తడిసిన ధాన్యాన్ని ఉప్పుడు బియ్యంగా అమ్ముకోవచ్చు

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

రంగు మారిన, తడిసిన ధాన్యాన్ని పచ్చి బియ్యం కాకుండా ఉప్పుడు బియ్యంగా అమ్ముకోవడం వల్ల నష్టాన్ని కొంతమేర తగ్గించుకోవచ్చని మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థ వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ టి.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో తుపాను, అధిక వర్షాల సమయంలో వరి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన వివరించారు. రాష్ట్రంలో మిచౌంగ్ తుపాను హెచ్చరికల నేపథ్యంలో, ఈదురు గాలులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వరి రైతులు తగిన జాగ్రత్తలు చేపట్టి పంట నష్టాన్ని నివారించుకోవాలన్నారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటలను వర్షాలకు ముందు రైతులు కోయరాదని తెలిపారు. కోసినా పూర్తిగా ఆరని పనలను తుపాను వాతావరణ నేపథ్యంలో కుప్పలు వేసేటప్పుడు ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లాలని చెప్పారు. కోత కోసి పొలంలో ఉన్న పనలు వర్షానికి తడిస్తే గింజ మొలకెత్తకుండా ఉండడానికి ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పడేవిధంగా పిచికారీ చేయాలని సూచించారు. కల్లాల మీద ఉన్న ధాన్యాన్ని వర్షానికి తడవకుండా రైతులు భద్రపరుచుకోవాలన్నారు. నూర్చిన ధాన్యం రెండు, మూడు రోజులు ఎండ బెట్టడానికి వీలు కాకపోతే కుప్పల్లో గింజ మొలకెత్తడమే కాక రంగు మారి చెడు వాసన వస్తుందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో నష్టాన్ని నివారించడానికి ఒక క్వింటాలు ధాన్యానికి ఒక కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక లేక ఎండుగడ్డి కలిపి ధాన్యం పోగు పెట్టడం వల్ల గింజ మొలకెత్తకుండా, చెడిపోకుండా నివారించుకోవచ్చని తెలిపారు.

వైసిపితోనే దళితుల అభ్యున్నతి

ఎస్‌సి ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ ఆనంద్‌ప్రకాష్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ ప్రభుత్వం కృషి చేయని విధంగా దళితుల అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఎస్‌సి ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ చెల్లెం ఆనంద్‌ప్రకాష్ అన్నారు. స్థానిక మార్కెట్ యార్డు ఆదివారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌ప్రకాష్ మాట్లాడుతూ దళితులకు సంబంధించి 24 పథకాలు జగనన్న ప్రభుత్వం నిలిపి వేసిందని ప్రతిపక్షాలు కుట్ర పూరితంగా ఆరోపిస్తున్నాయని, అది నిజం కాదని తెలిపారు. సబ్‌ప్లాన్‌లో ఎస్‌సిలకు ఏడు శాతం, ఎస్‌టిలకు 15 శాతం నిధులు విడుదలవుతాయని, కాని మన జగనన్న అంతకు మించి ఖర్చు చేసి దళిత సమాజాన్ని, దళిత వాడలను అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. నాడు-నేడు పథకంలో స్కూళ్లను, హాస్టల్స్‌ను అభివృద్ధి చేసి, జగన్ తీసుకొచ్చిన నూతన విద్యావిధానం ప్రభుత్వం పాఠశాలలో ఆంగ్ల భాషను ప్రవేశపెట్టారని, ఈ విధానం దళిత విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. దళితుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. గత టిడిపి ప్రభుత్వం దళితులను రాజకీయంగా ఆర్థికంగా ఎదగనివ్వలేదని, కనీసం ఎస్‌సి, ఎస్‌టి సప్లై నిధులు పూర్తిస్థాయిలో ఖర్చు పెట్టలేదని, దీంతో దళితులకు గత ప్రభుత్వంలో ఎంతో నష్టం వాటిల్లిందని తెలిపారు. ఈ సమావేశంలో మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ లలిత కుమారి, ఎస్‌సి నాయకులు సత్య సుధామ, కటికతల రాజారావు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

మండలంలోని పోలింగ్ బూత్‌లను ఆదివారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.స్వామినాయుడు పరిశీలించారు. పోలింగ్ బూత్‌ల సౌకర్యం ఎలా ఉన్నాయో బిఎల్‌ఒలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ నమోదు పరిశీలించారు. మార్టేరు, నెగ్గిపూడి, వెలగలేరు, బ్రాహ్మణచెరువు, పెనుమంట్ర, వెలగలవారిపాలెం, భట్లమాగుటూరు, ఆలమూరుతో పాటు పలు గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. వీరితోపాటు తహశీల్దార్ దండు అశోక్‌వర్మ, ఎంపిడిఒ పి.పద్మజ పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న స్వామినాయుడు

డెంగీ బారిన వెదుళ్లపాలెంవాసులు

ఒకరు మృతి, చికిత్స పొందుతున్న 9 మంది
అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల వేడుకోలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని లంకల కోడేరు పంచాయతీ పరిధిలోని వెదుళ్లపాలెంలో పలువురు అనారోగ్యాలకు గురై పాలకొల్లు ప్రయివేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని 13వ వార్డు మెంబర్ మాదు సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన ఇర్రింకి శంకరం (55) డెంగీ వ్యాధితో రక్త కణాలు క్షీణించి చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందారన్నారు. తొమ్మిది మంది వరకు ఈ డెంగీ వ్యాధి బారిన పడి చికిత్స పొందుతున్నారన్నారు. దీనిపై వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగు చర్యలు తీసుకుని తమకు అండగా నిలవాలని సుబ్రహ్మణ్యం కోరారు.

చికిత్స పొందుతున్న డెంగీ బాధితులు

కాంగ్రెస్‌కు త్వరలో పూర్వవైభవం

టిటిడి మాజీ ఛైర్మన్ కనుమూరి బాపిరాజు

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రజాస్వామ్యానికి కాంగ్రెస్ పార్టీ పుట్టినిల్లు అని, త్వరలో కాంగ్రెస్ పార్టీ పూర్తి పూర్వ వైభవాన్ని చేకూర్చుకుంటుందని మాజీ మంత్రి, టిటిడి బోర్డు మాజీ ఛైర్మన్ కనుమూరి బాపిరాజు ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొచ్చిన సందర్భంగా ఆదివారం తన నివాసం వద్ద ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులని, వారు ఏ విషయాన్ని అంత తేలిగ్గా మర్చిపోరని చెప్పారు. ఓటు హక్కును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును ప్రభుత్వాలు గౌరవించాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టిన కాంగ్రెస్ పార్టీలో సభ్యుడిగా ఉండడం మనకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ పునాదులు చాలా లోతైనవన్నారు. పిసిసి ప్రధాన కార్యదర్శి జంపాల సుబ్రహ్మణ్యరాజు (జెఎస్‌ఆర్) మాట్లాడుతూ రాష్ట్రంలో కూడా మార్పు అవసరమన్నారు. ప్రజల్లో మార్పు వస్తే డబ్బు ఎంత మాత్రం పనిచేయదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం పూర్తవ్వడం వంటివి కావాలంటే తిరిగి కాంగ్రెస్‌కు అధికారాన్ని కట్టబెట్టాలని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి గోపాలకృష్ణరాజు, కె.సీతారాం, పార్టీ మండల ఇన్‌ఛార్జి చింత ఆదిశేషు పాల్గొన్నారు. ఆకివీడు మెయిన్ సెంటర్‌లో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, మహాత్మ గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సెంటర్‌లో మిఠాయిలు పంపిణీ చేసి బాణసంచా కాల్చారు.

పాలకొల్లు : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన సందర్భంగా కాంగ్రెస్ పాలకొల్లు పట్టణ అధ్యక్షులు యడ్ల శివాజీ ఆధ్వర్యంలో గాంధీ బొమ్మల సెంటర్‌లో విజయోత్సవాలు జరిపారు. తొలుత మహాత్మ గాంధీ, నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి బాణసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలికేట్ మహబూబా జానీ, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కొలకలూరి అర్జున్‌రావు, బోనం వెంకట్రావు, రొక్కాల బెన్నీపాల్, చాగంటి అంజిబాబు, రొంకాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంత ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లండి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర తుపానుగా బలపడిందని, ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలు పునరావాస కేంద్రాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తుపాన్ నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని పేర్కొన్నారు. కంట్రోల్ రూమ్‌లు అందుబాటులో ఉన్నాయని, సహాయం కోసం నిరంతరం ఇవి పని చేస్తాయని ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. జిల్లాలో నరసాపురం, మొగల్తూరు, ఆచంట, యలమంచిలి మండలాలు ఎక్కువగా తుపానుకు తాకిడికి గురయ్యే అవకాశం ఉందన్నారు. ఆయా మండలాల ప్రజలు అధికారుల సూచనల మేరకు వెంటనే పునరావస కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. కల్లాలోని ధాన్యం వెంటనే రైతు భరోసా కేంద్రాలకు తరలించాలని తెలిపారు. మాసుళ్లు పూర్తి చేసి భద్రపరిచిన ధాన్యాన్ని తడవకుండా జాగ్రత్త పరుచుకోవాలని సూచించారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు 111 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - భీమవరం

2023-24 విద్యా సంవత్సరంలో జరగనున్న నేషనల్ మీన్స్-కమ్-మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు 111 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2,921 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 2,810 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. 111 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. 13 పరీక్షా కేంద్రలను తనిఖీ చేసినట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని వెల్లడించారు.

యాత్రికులతో ముత్యాలమ్మ ఆలయం రద్దీ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మను ఆదివారం యాత్రికులు దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు పర్యవేక్షణలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణాల భజన కాలక్షేపం, ప్రసాద వితరణ, తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ఓటరు జాబితా పరిశీలన

ప్రజాశక్తి - ఉండి

మండల వ్యాప్తంగా నిర్వహించిన ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియను ఆదివారం టిడిపి నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, తమ ఓటు ఏ పోలింగ్ బూత్‌లో ఉందో చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు చెన్నంశెట్టి హరినాయుడు, యూనిట్ ఇన్‌ఛార్జి గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, బూత్ ఇన్‌ఛార్జి బండారు సుబ్బారావు పాల్గొన్నారు.

పలుచోట్ల ఘనంగా కార్తీక వనసమారాధన

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

కార్తీకమాసం పురస్కరించుకుని ఆదివారం పెనుమంట్ర చెరువుగట్టు పక్కన రెడ్డి యూత్ ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. పెనుమంట్ర రెడ్డి యూత్ లయన్స్ ఆధ్వర్యంలో వైసిపి పెనుమంట్ర గ్రామ అధ్యక్షుడు తేతలి సుధీర్‌రెడ్డి అధ్యక్షతన అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు, రాజమండ్రి రుడా ఛైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, ఎంపిపి కర్రి వెంకటనారాయణరెడ్డి (వాసురెడ్డి) హాజరయ్యారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. లక్కీ డ్రా ద్వారా ఎల్ఇడి టివి, వెట్ గ్రైండర్, మిక్సీ, మహిళలకు, ఖరీదైన రెండు పట్టు చీరలు, బహుమతులు అందించారు. నెగ్గిపూడిలో ఐటిఐ కాలేజీలో కాపు వన భోజనాలు నిర్వహించారు.

ఆచంట : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆచంట మండలంలో కొడమంచిలి, ఆచంట ఎఎంసి కార్యాలయం ఆవరణలో శెట్టిబలిజ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం వన సమారాధన కార్యక్రమాలు ఉల్లాసంగా ఉత్సాహంగా సాగాయి. ఈ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వన సమారాధన కార్యక్రమంలో ఆయా కులస్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో గడిపారు. ఈ సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కొడమంచిలి బిసి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ శెట్టిబలిజ గౌడ సంఘాలు అభివృద్ధి చెందాలంటే ఐక్యతగా ఉండి పోరాడాలన్నారు. ఆచంట ఎఎంసి కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన వన సమారాధన కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ సాధికార సంఘ అధ్యక్షులు గుడాల శ్రీనివాస్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ మండల అధ్యక్షులు కేత రామకృష్ణ మాట్లాడుతూ దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహ ఏర్పాటుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు పెచ్చెట్టి శ్రీరామచంద్రమూర్తి, దొమ్మేటి రాంబాబు, దొంగ నాగార్జున, పెచ్చెట్టి సత్యనారాయణ, బాలం నాగేశ్వరరావు, మొల్లేటి అరుణ్‌శ్రీనివాస్, కుడిపూడి శ్రీనివాస్, కేత నాగాంజనేయులు, కేతా మురళి పాల్గొన్నారు.

పాలకొల్లులో...

పాలకొల్లు : వన సమారాధనలతో ఆయా సామాజిక తరగతుల్లో ఐక్యత, అనురాగం పెరుగుతాయని వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ చెప్పారు. ఆదివారం క్షీరపురి శాలివాహన (కుమ్మరి) సంఘం వారి కార్తీక వన సమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గోపీకి క్షీరపురి శాలివాహన (కుమ్మరి) సంఘం అధ్యక్షులు స్వాగతం పలికారు. ఆయనతో పాటు కొలుకులూరి అర్జున్‌రావు ఉన్నారు.

పాలకొల్లు రూరల్ :మండలంలోని లంకలకోడేరులో క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన రామసూరిగారి కొబ్బరి తోటలో ఆదివారం నిర్వహించారు. ఆటపాటలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అందరూ కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడిపారు. ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ సేవా సమితి అధ్యక్షులు వేణు రాజు, కార్యదర్శి ప్రసాద్‌రాజు, లంకలకోడేరు గ్రామ సర్పంచి చొప్పల రజిని, సమితి మాజీ ప్రెసిడెంట్ రామసూరి పాల్గొన్నారు.

మండలంలోని అయ్యప్పస్వామి ఆలయ సమీప పెద్దగరువు ప్రాంతంలో ఆదివారం పాలకొల్లు పెయింటర్స్, ఆర్టిస్ట్ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలోని పాలకొల్లు నియోజకవర్గంలో చేస్తున్న నిరంతర సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. 2024లో అధికారంలోకొచ్చే టిడిపి ప్రభుత్వంలో సంఘానికి చెందిన భవనంపై తాత్కాలికంగా ఉన్న షెడ్డు స్థానంలో శాశ్వత మొదటి అంతస్తు భవన నిర్మాణం చేపట్టేందుకు రూ.20 లక్షలు మంజూరుతో పాటు సంఘ పెద్దలచే ప్రారంభోత్సవం జరిగేలా చూసే బాధ్యత తీసుకుంటానని ఎంఎల్ఎ హామీ ఇచ్చారు. నిత్యం కష్టపడి పనిచేసుకునే పెయింటర్స్, ఆర్టిస్టులు వారికి వచ్చే కొద్దిపాటి సంపాదన కుటుంబంతో పాటు సేవా కార్యక్రమాలకు వినియోగించడం అభినందనీయమన్నారు. ధర్మారావు ఫౌండేషన్ ద్వారా తాను జరిపే సేవా కార్యక్రమాల్లో పెయింటర్స్ ఆర్టిస్టులు భాగస్వాములు అవుతున్నారని, అందుకు రుణపడి ఉంటానని ఎంఎల్ఎ నిమ్మల తెలిపారు.

పాలకొల్లులోని శాలివాహన సంఘ సొంత భవన నిర్మాణానికి అవసరమైన నిధులు రూ.50 లక్షల మంజూరుతో పాటు సంఘ పెద్దలచే ప్రారంభోత్సవం జరుపుకునేందుకు తాను కృషి చేస్తానని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు హామీ ఇచ్చారు. 2024లో అధికారంలోకి రానున్న టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వంలోనే నెరవేరుతుందన్నారు. సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్తీక వన సమారాధనలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శాలివాహన సామాజిక చిన్నపాటి సమావేశాలు, ఫంక్షన్లు జరుపుకునేందుకు సరైన కల్యాణ మండపం లేకపోవడంతో గత టిడిపి ప్రభుత్వంలో ప్రభుత్వ భూములు లేకపోయినా పడగర్ల చెరువులో స్థలం ఇచ్చినట్లు చెప్పారు. ఆ స్థలంలో తాత్కాలిక షెడ్డు ఏర్పాటు చేసుకున్నారని, దీని స్థానంలోనే కొత్త నిర్మాణం జరుపుకోవాలన్నారు. శాలివాహన సంఘీయులు రాజకీయంగా ముందుకు వెళ్లాలని, నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత ఇస్తానని ఎంఎల్ఎ హామీ ఇచ్చారు.

మొగల్తూరు : మొగల్తూరులోని ఆర్యవైశ్య సభ్యులు ఆదివారం కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉసిరిచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. సత్యనారాయణ స్వామి వ్రతం, వాసవి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు మ్యూజికల్ చైర్స్ తదితర పోటీలు నిర్వహించారు. యువజన సంఘం ఆధ్వర్యంలో లక్కీ డిప్ ఏర్పాటు చేశారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల శాఖ అధ్యక్షులు అనంతపల్లి హరినాథ్ బాబాలు, గ్రామ అధ్యక్షులు నాగేశ్వరరావు, యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మొగల్తూరులో....

మొగల్తూరులోని గౌడ సంఘస్తులు ఆదివారం కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు, చిన్నారులకు ఆటల పోటీ నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.